# పెళ్ళిరోజు

-ఎం.వీరేశ్వరరావు

"భలే మంచిరోజు. పసందైన రోజు. వసంతాలు పూచేరోజు...

ఆ!... ప్రకాశం పెళ్లిరోజు..." ఆరోజు ఉదయమే ఈల వేసుకుంటూ లేచి భార్య రమణిని పిలిచి తన ప్రోగ్రామ్ పెళ్లిరోజుది వినిపించాడు.

"చూడు రాణీ ప్రేమ పెరిగినప్పుడు ప్రకాశం అలా పిలుస్తాడు, ఇది మన పెళ్లి రోజు. అరుదుగా మనిద్దరం కలిసి సెలబ్రేట్ చేసుకొనే రోజు వచ్చింది. ఈ రోజు మార్నింగ్ నుండి రాత్రి వరకూ ఇద్దరం కలిసి ఉండాలి. ప్రోగ్రాం ఫిక్స్ చేశాను. ఉదయం టిఫిన్ తర్వాత మన 'బాబి'గాడిని శ్యామ్ వాళ్ల ఇంట్లో వదిలేస్తాను. సాయంత్రం దాకా వాడు క్రికెట్ బ్యాట్‌తో కుస్తీ పట్టి సాయంత్రం మళ్లీ మన ఇంటికి వస్తాడు. ఈలోగా మనం ఉదయం ఆట, మ్యాట్నీ వేసుకోవచ్చు. 'ఆ'సినిమా" అంటూ చెవిలో గొణిగాడు ప్రకాశం.

"ఛీపాడు క్రొత్తగా పెళ్లయినట్లు" సిగ్గు పడింది రమణి.

"పెళ్లిరోజు అంటే ఏమిటనుకున్నావ్! మ్యాట్నీ తర్వాత నీకు గిఫ్ట్ కొనడం వగైరా..." ఇలా చాలా ఉన్నాయి. ప్రస్తుతానికి కాఫీ కలుపు" అంటూ హుషారుగా బాత్‌రూమ్‌లోకి పోయాడు ప్రకాశం. ప్రకాశానికి, రమణికి పెళ్లి రోజున ఒకేచోట ఉండటం కుదరడం లేదు. ఏవో కారణాల వల్ల! సరే ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలనుకున్నాడు ప్రకాశం.

★★★

ప్రకాశం హాల్లో కూర్చుని ఉన్నాడు. ఎదురింటి నుండి బామ్మగారు వచ్చి-

"అమ్మాయ్ కొంచెం పంచదార అప్పు ఇయ్యి. రాత్రి అదేం సీరియల్ అబ్బా ఎనిమిది వందల ఎపిసోడ్ ఏం జరిగింది! వీణని కలుసుకోవడానికి వేణు గోడ ఎక్కుతున్నాడు!"

"ఎక్కాడా బామ్మగారు?" అడిగింది ఆసక్తిగా రమణి!

"ఆ! ఆ! ఎక్కాడు వీణ కనబడలేదు. అయ్యగారికి కాలువిరిగింది."

"నువ్వు త్వరగా కాఫీ పట్రా! అమ్మా బామ్మగారు మీరు సీరియల్ చూడండి! మాకు ఉదయమే ప్రత్యక్ష వ్యాఖ్యానం అక్కర్లేదు" అని విసుక్కున్నాడు ప్రకాశం!

"మీ ఆయన ఇంట్లో ఉన్నాడా? తరువాత వస్తాను! అయినా పని మానేసి సోమరిపోతులా ఇంట్లో ఏడుస్తున్నాడా?" అంది బామ్మగారు!

"కాదండి. ఈ రోజు మా పెళ్లిరోజు" అంది రమణి.

"అలాగే స్పెషల్స్ ఏమిటో?"

"ఆ! పచ్చిగడ్డి, పచ్చి క్యారెట్ మీకెందుకు దయచెయ్యండి" గట్టిగా అరిచాడు మ్యార్నింగ్ షో మిస్సవుతుందని ఆందోళనతో ప్రకాశం.

"పచ్చిగడ్డి ఎందుకో? ఎండుగడ్డి పనికిరాదా?"

"పచ్చిగడ్డి అయితే కళ్లజబ్బులు రావు. చూశారా ఎప్పుడైనా ఆవుకళ్ల జోడు పెట్టుకోవడం!"

దెబ్బతో బామ్మగారు మాయం.

★★★

ప్రకాశం రమణిని దగ్గరికి తీసుకొని నుదుటిమీద ముద్దు పెట్టుకున్నాడు.

"సాయంత్రం గిఫ్ట్ ఏం కొంటున్నారు?"

"ఏ పడతి అయినా 'పైకాన్ని' ప్రేమిస్తుంది! 'పైకం'లో ఉన్న పురుషుడు తనను ప్రేమిస్తోందని భ్రమిస్తాడు."

"జోకులు కాదు నిజం చెప్పండి!"

"కబుర్లు తర్వాత.." అంటూ ప్రకాశం రమణిని గట్టిగా కౌగిలించుకున్నాడు.

సరిగ్గా అప్పుడు ప్రకాశం చొక్కా జేబులో ఉన్న సెల్ మ్రోగింది!

"ఎవరూ" అన్నాడు ప్రకాశం.

"ఒరే నేను నీ దగ్గర ఆరు ఏళ్ల క్రితం వెయ్యి రూపాయలు అప్పు తీసుకున్న అంజిబాబుని. వస్తున్నా నీకివ్వడానికి ఇంకో గంటలో నీ ఎడ్రస్ చెప్పు"

"కంగారెందుకు? రేపు రావచ్చు కదా" ప్రకాశం.

"ఇదిగో అరుదైన అవకాశం! ఇప్పుడు నేను వచ్చి ఇవ్వలేదో మళ్లీ జన్మలో నీకు వెయ్యి రూపాయలు రావు నేను దుబాయ్ పోతున్నా. ఎడ్రస్ ఇయ్యి"

"ఎవరూ" అడిగింది రమణి!

"అంజిబాబు"

"అంజా! ఇలా ఇవ్వండి!" అంటూ సెల్ లాక్కుని మాట్లాడింది రమణి.

"రండి అన్నయ్యగారు! మీరు ఇచ్చే వెయ్యి రూపాయలతో మంచి చీర తీసుకుంటా! ఈ రోజు మ్యారేజ్ డే! స్పెషల్స్ కూడా ఉంటాయి..." ఇలా గడాగడా మాట్లాడింది రమణి.

సెల్ తీసుకొని "త్వరగా తగలడి త్వరగా మమ్మల్ని వదిలెయ్యి" అని అంజిబాబుతో చెప్పాడు.

కొద్దిసేపయ్యాక బయటికి వెడుతూ-

"బాబిగాడిని శ్యాం ఇంట్లో వదులుతాను. ఈలోగా అంజిగాడు వస్తే కాస్త 'గరాటు' పట్టి నీళ్లు కలిసిన పాలతో టీ చేసి పొయ్యి" అన్నాడు.

★★★

"అంజీ నా డబ్బులు నాకు వస్తాయనుకోలేదురా! తిరుపతి హుండీలో వేశాననుకున్నా."

"ఛ ఏనాటికైనా అంజి తన రుణాల్ని తీర్చిపోతాడు. సరే సిస్టర్ స్పెషల్ ఏమి చేశారు?"

"గన్నేరుపప్పు బిర్యాని" అన్నాడు ప్రకాశం.

"అది కూడా చేసుకుంటారా!"

"మామూలుగా చేసుకోరు! రాక రాక వచ్చావు కదా! నీ కోసం 'స్పెషల్'గా ఏర్పాటు చేశాను" 'మ్యార్నింగ్ షో' పోయిందని లోపల ప్రకాశం బాధ పడుతూ!

అంజిబాబు వెయ్యి రూపాయలు ఇచ్చి ఇంక కబుర్లు మొదలుపెట్టాడు.

స్పెషల్స్ లాగించాడు పాయసం, గులాబ్‌జామ్ వగైరా!

షేర్ మార్కెట్ల గురించి, రాజకీయాల గురించి, సెల్‌ఫోన్‌ల్లో రకాల గురించి, టీవీ సీరియల్స్ గురించి, అప్పుల గురించి, తన గురించి, ఆడ వాళ్ల గురించి, ఆడియో ఫంక్షన్ల గురించి ఇలా గుక్క తిప్పుకోకుండా మూడు గంటలు అంజి బాబు మాట్లాడాడు. ఆ వాగ్ధాటికి మండు వేసవిలో వడదెబ్బ తగిలిన వాళ్లల్లా క్రింద పడిపోయారు ప్రకాశం, రమణి. మధ్యాహ్నం రెండు గంటలకి వదిలాడు అంజిబాబు.

***

అంజిబాబు వెళ్లాక ప్రకాశం హాయిగా వాలుకు ర్చీలో కూర్చుని టీ త్రాగుతున్నాడు. ఎదురుగా రమణి వీక్లీ తిరగేస్తోంది.

"మ్యాట్నీ టైమ్ అయ్యిందే" అంటూ పైటలా గాడు ప్రకాశం!

మళ్లీ మ్రోగింది సెల్!

"హలో!" అన్నాడు ప్రకాశం!

"బావా నేను భ్రమరాంబను!"

"అలాగా మరదలా ఎక్కడి నుండి?"

"దిల్‌సుఖ్‌నగర్ నుండి! నేను అర్జెంటుగా అక్కని చూడాలి! నువ్వు స్కూటర్ తీసుకొని దిల్‌సుఖ్‌న గర్ ఆల్ఫా కేఫ్ ఎదురుగా ఉన్న సందు నుండి మళ్లీ ఎడం వైపు తిరిగి ఆ తర్వాత సెకండ్ రైట్ తిరిగి...3-24కి వచ్చెయి"

ఆ ఎడ్రస్‌తో ప్రకాశం తల తిరిగి, "సరే రేపు వచ్చి నిన్ను పికప్ చేసుకుంటా!" అన్నాడు.

"రేపుకుదరదు! ఈ రోజే రావాలి!" అంది భ్రమ రాంబ.

"ఈ రోజా మ్యారేజ్‌డే మాది! కుదరదు!" అన్నాడు ప్రకాశం!





## అనుబంధం

కొన్ని బంధాలు కలకాలం గుర్తుండిపోతాయి. మాజీ అందాలసుందరి సుస్మితాసేన్ పెంపుడుకూతురు రేనీతో కలిసి జీవితంలో మధురానుభూతుల్ని సొంతం చేసుకుంటోంది. అయితే ఈమధ్య ఆమె వెన్నునొప్పితో బాధపడుతున్నట్టు వార్తలొచ్చాయి. ఆ విషయం గురించి అడిగితే 'అది నిజమే. రేనీ నాకు తోడుగా ఉంటే చాలు ఎలాంటి ఇబ్బందులు నా దరిచేరవు. రేనీతో అనుబంధం బాగా పెరిగిపోతోంది. రేనీ లేకుండా ఒక్క క్షణం కూడా నేను ఉండలేకపోతున్నాను' అంటోంది సుస్. నటించడం కన్నా ఇలాంటి జీవితమే తనకి బాగుందని చెబుతున్న సుస్మిత లైఫ్‌స్టయిల్ ఏమిటో ఎవ్వరికీ అంతు చిక్కడంలేదు.

"ఎవరండీ సెల్‌లో"

"మీ చెల్లెలు!"

"వస్తుందా?"

"కాదు నన్ను రమ్మంటోంది స్కూటర్ తీసుకొని"

"వెళ్లండి"

"నాకు కుదరదు!" అన్నాడు ప్రకాశం! సెల్‌లో గట్టిగా

"అలాగా బావ! ఇప్పుడు రాలేదనుకో! ఆ రోజు నీలం రంగు చీర అమ్మాయి విషయం అక్కకు చెప్తాననుకో! నీ కాపురం కొల్లేరు అయిపోతుంది!" బెదిరించింది భ్రమరాంబ.

"ఆ! అంత పని చెయ్యకు! వస్తున్నా!"

"మ్యారేజ్ డే నాడు 75 కేజీల మూట వెనక్కాల పెట్టుకొని తిరిగే యోగం ఉందని ఎవడూ వారఫలాల్లో రాయలేదేమిటి? వార ఫలాలు...తినడానికి పనికి రాని ఫలాలు... ఫలించని ఫలాలు"

"75 కేజీల మూట అంటున్నారు ఎవర్ని"

"మీ చెల్లెలు గురించి"

"ఏదో కొంచెం పుష్టిగా, ఒళ్లుచేస్తే అలా అంటారేమిటి?"

"నీ చెల్లెల్ని తీసుకురావాలంటే స్కూటర్ వెనుక లారీ టైరు వేయించుకొని వెళ్లాలి."

తిట్టుకుంటూ దిల్‌సుఖ్‌నగర్ వెళ్లాడు.

భ్రమరాంబని తీసుకొచ్చాడు. భ్రమరాంబ దారిలో ఐస్‌క్రీమ్స్ అని, పిజ్జాలని, బర్గర్‌లని ప్రకాశం చేత చాలా కొనిపించింది. నీలంరంగు చీర అమ్మాయి సంగతి చెబుతుందని అన్నీ భరించాడు ప్రకాశం.

***

రాత్రి పదిన్నర.

"ఏమండీ హాల్లో ఏదో చప్పుడవుతోంది. వెళ్లి చూడండి" అంది రమణి.

తిట్టుకుంటూ లేచాడు. హాల్లోకి వెళ్లి లైటు వేశాడు. ఎదురుగా దొంగ చాకు పుచ్చుకొని!

ఒక్కసారిగా నిర్ఘాంతపోయాడు ప్రకాశం!

"తియ్యి క్యాష్ తియ్యి, ఏయ్ నీ ఒంటి మీద బంగారం" అంటూ బెదిరించాడు రమణిని, ప్రకాశాన్ని.

"బంగారమా! బంగారం ధర పెరిగాక మా ఆవిడ బంగారం మానేసి గిల్టువి పెట్టుకుంటోంది!

అప్పుడు దొంగ దగ్గర ఉన్న సెల్ మ్రోగింది.

'దొంగ దగ్గర కూడా సెల్లా' అని ఆశ్చర్యపోయాడు ప్రకాశం!

"నేను ఇక్కడ నాలుగో వీధిలో ఉన్నాను. పని ముగించుకొని ఓ అరగంటలో వస్తాను" అని సెల్ ఆఫ్ చేసి ప్రకాశం కేసి తిరిగి "తియ్యి క్యాష్ తియ్యి"!

"క్యాషా! భలే జోకు వేశావు! నిన్ననే మా అబ్బాయి స్కూలు ధనాధన్ కాన్వెంట్ ప్రిన్సిపాల్ పట్టుకుపోయాడు మొత్తం క్యాష్‌ని!"

"అదేమిటీ ఈ మధ్య స్కూలు ప్రిన్సిపాల్స్ దోచుకుంటున్నారా మాకు పోటీగా?!"

"అదేలే! వాళ్లు 'ర్యాంకులు' చూపుతారు. మీరు 'చాకులు' చూపుతారు అంతే తేడా!"" అన్నాడు ప్రకాశం.

"సర్లే కబుర్లు! ఎంత ఉంటే అంత ఇయ్యి! లేకపోతే చీరేస్తా" అన్నాడు దొంగ!

"ఎంత అంటే ఓ పాతిక పట్టుకు వెళ్లు, ఒ పాత చీర కూడా వేస్తా"

"వేలా?"

"కాదు అక్షరాలా పాతిక రూపాయలు?"

"వెటకారమా!" అంటూ రమణి గొలుసు పట్టుకున్నాడు.

"పాము...పాము..." అంటూ ప్రకాశం అరిచాడు.

దొంగ కంగారుపడి క్రిందకి చూశాడు. ప్రకాశం వెనక నుండి దొంగను కొట్టి క్రిందకి పడేసి తువ్వాలుతో దొంగ చేతులు కట్టేశాడు.

"దొంగ దొంగ" అని కేకలు పెట్టాడు.

చుట్టుప్రక్కల వాళ్లు ఎవరూ రాలేదు.

రమణి తెలివిగా "మంటలు మంటలు" అంది. అందరూ వచ్చారు బయటకి తమ ఇళ్లు కూడా అంటుకుంటాయని. కాలనీ వాళ్లు వచ్చి ప్రకాశం ధైర్యాన్ని మెచ్చుకున్నారు. కొంతమంది, ప్రకాశం కలిసి పోలీస్ స్టేషన్‌లో దొంగను అప్పగించారు.

ఎస్.ఐ. అడిగిన ప్రశ్నలకి ప్రకాశం ఓపికగా జవాబు చెప్పాడు. ఎస్.ఐ. చెప్పాడు-

"ప్రకాశం గారు! మిమ్మల్ని అభినందించాలి. ఎప్పటి నుండో వెదుకుతున్న దొంగని అప్పగించారు. మీకు ఉదయం 50 వేల రూపాయలు రివార్డ్ ఇస్తాం."

ఆనందం తట్టుకోలేక మూర్ఛపోయాడు ప్రకాశం!

ప్రకాశం ఇంటికి వచ్చాడు. మంచం మీదకి చేరాడు. రాత్రి ఒంటి గంట అయ్యింది.

"మ్యారేజ్ డే బిగినింగ్ కన్నా ఎండింగ్ బాగుంది కదా!" అంది రమణి! లైట్ ఆఫ్ చేస్తూ.

ఆ మాటలు ప్రకాశానికి చేరలేదు. అతని గురక ఆమెకు చేరింది.

★

